

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

20 లోపు 'దళితబంధు' ఇవ్వకపోతే రణరంగమే

- ఈ నెల 9న హుజూరాబాద్‌లోని నా ఇంటి వద్ద ఉంటా
- దళితబంధు రానివారు దరఖాస్తులు ఇవ్వాలె: ఎమ్మెల్యే పాడి

హుజూరాబాద్ టౌన్, నవంబర్ 6: 'దళితబంధు రెండో విడత నిధులను ఈ నెల 20లోగా ఇవ్వకపోతే హుజూరాబాద్ నియోజకవర్గం రణరంగం అవుతది. కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, నాయకులను స్థానికంగా తిరగనివ్వం' అని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి స్పష్టంచేశారు. బుధవారం కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌లోని తన నివాసంలో ఆయన మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ దళితుల అభ్యున్నతి కోసం పైలెట్ ప్రాజెక్టుగా దళితబంధు పథకాన్ని ప్రవేశపెట్టి హుజూరాబాద్‌లోని సుమారు 20 వేల కుటుంబాలను ఆదుకున్నారని గుర్తుచేశారు. దళితబంధు రెండో విడత డబ్బులు వారి అకౌంట్లలో ఉన్నప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం ఖాతాలను ఫ్రీజ్ చేసి దళితులను దగా చేస్తున్నదని విమర్శించారు. ఈ నెల 9న హుజూరాబాద్‌లోని తన ఇంటి వద్ద టెంట్ వేసుకొని కూర్చుంటానని, దళితబంధు రెండో విడత రాని వారంతా వచ్చి దరఖాస్తులు ఇవ్వాలని సూచించారు. ఆ దరఖాస్తులను తానే స్వయంగా కలెక్టర్‌కు ఇస్తానని తెలిపారు.

అమరులకు నివాళి కేసు విచారణ వాయిదా

- కోర్టుకు హాజరైన బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి

హైదరాబాద్, నవంబర్ 6 (నమస్తే తెలంగాణ): తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బీఆర్ఎస్ ర్యాలీపై పోలీసులు నమోదు చేసిన కేసు విచారణ డిసెంబర్ 12కు వాయిదా పడింది. జూన్ 1న బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు క్యాం డిల్ ర్యాలీ నిర్వహించగా సైఫాబాద్ పోలీసులు నమోదు చేశారు. ఈ కేసుకు సంబంధించి బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి బుధవారం నాంపల్లి కోర్టుకు హాజరయ్యారు. అన్ని అనుమతులు తీసుకున్నాకే తాము క్యాండిల్ ర్యాలీ నిర్వహించామని శ్రీనివాస్‌రెడ్డి తరపు న్యాయవాది జక్కుల లక్ష్మణ్ కోర్టుకు నివేదించారు. ఈ కేసుపై హైకోర్టులో క్వాష్ పిటిషన్ వేస్తామని తెలిపారు. వాదనలు విన్న కోర్టు తదుపరి విచారణను డిసెంబర్ 12కు వాయిదా వేసిం ది. కోర్టు ప్రాంగణంలో శ్రీనివాస్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో అమరులకు నివాళులు అర్పించే స్వేచ్ఛ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తంచేశారు.

మళ్లీ ఫుడ్‌పాయిజన్ కలకలం

- మంచిర్యాల ఆశ్రమ పాఠశాలలో 12 మంది విద్యార్థినులకు అస్వస్థత
- దవాఖానకు తరలించిన సిబ్బంది
- వాంకిడి ఘటన తర్వాత కూడా నిర్లక్ష్యం వీడని ప్రభుత్వం
- ఉడకని కిచిడీ, చింతపులుసు పెడుతున్నారన్న విద్యార్థినులు
- విద్యార్థినులు ఇంటి పచ్చడి తిన్నారు : ఐటీడీఏ పీవో

మంచిర్యాల దవాఖానలో ఉన్న విద్యార్థినులతో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల, నవంబర్ 6(నమస్తే తెలంగాణ ప్రతినిధి): మళ్లీ మరో ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలలో ఫుడ్ పాయిజన్ అయింది. మంచిర్యాల జిల్లాలో బుధవారం 12 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురికాగా, వారిని ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మంచిర్యాల పట్టణం సాయికుంట బాలికల గిరిజన ఆశ్రమ పాఠశాలలో బుధవారం ఉదయం పెట్టిన కిచిడీ తిన్న విద్యార్థినులు 12 మంది అస్వస్థతకు గురయ్యారు. పదో తరగతి విద్యార్థినులు ఉదయం 7 గంటలకు కిచిడీ తిన్నారు. పాఠశాలలో ఉదయం 11 గంటల సమయంలో క్లాస్‌లు నడుస్తుండగా వాంతులు మొదలయ్యాయి. ఒకరి తర్వాత ఒకరు రెండు, మూడుసార్లు వాంతులు చేసుకోవడంతో వారిని పాఠశాల సిబ్బంది మంచిర్యాల ప్రభుత్వ దవాఖానకు తరలించారు. చికిత్స అనంతరం విద్యార్థినులు కుదుటపడ్డారు. వారిని అబ్జర్వేషన్‌లో ఉంచామని, భయపడాల్సిన అవసరం లేదని అందరూ ఆరోగ్యంగానే ఉన్నారని వైద్యులు తెలిపారు. ఫుడ్ పాయిజన్ గురించి తెలుసుకున్న మంచిర్యాల కలెక్టర్ కుమార్‌దీపక్ హుటాహుటిన దవాఖానకు వచ్చి విద్యార్థినులు, వైద్యులతో మాట్లాడారు. అస్వస్థతకు గురైన అందరూ పదో తరగతి విద్యార్థినులని చెప్పారు. బయటి నుంచి ఏదైనా తీసుకొచ్చి తిన్నారా? అని వారిని అడిగితే, తినలేదనే చెప్పారని కలెక్టర్ తెలిపారు. పిల్లలు తిన్న ఆహారం ఫుడ్ శాంపిల్స్‌తోపాటు పాఠశాలలోని తాగునీటి శాంపిల్స్‌ను సేకరించి పరీక్షలకు పంపించినట్టు వెల్లడించారు. ఆ ఫలితాలు వచ్చిన తరువాత బాధ్యులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. పండుగలకు ఇంటికి వెళ్లి వచ్చిన విద్యార్థినులు బయటి నుంచి ఏదైనా ఫుడ్ తీసుకొచ్చారా? అనే కోణంలో చెక్ చేయాలని వార్డెన్‌లను ఆదేశించినట్టు తెలిపారు. ప్రత్యేక వైద్య సిబ్బందితో పిల్లలను పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. అస్వస్థతకు గురైన విద్యార్థినులు మాత్రం తమకు ఉడకని లూస్‌గా ఉన్న కిచిడీతోపాటు చింతపులుసు పెట్టారని వెల్లడించారు. హాస్టల్‌లో వండే ఆహారం పూర్తిగా ఉడకకుండానే పెడుతున్నారని, రోజూ ఇదే పరిస్థితి ఉన్నదని ఆవేదన వ్యక్తంచేశారు.

పర్మిషన్ లేకుండా లీవ్ పెట్టిన ప్రిన్సిపాల్ సస్పెన్షన్

మంచిర్యాల గిరిజన ఆశ్రమ పాఠశాలలో విద్యార్థినులు ఫుడ్ పాయిజన్‌కు గురయ్యారని తెలిసి ఉట్నూర్ ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా ఆరా తీశారు. పాఠశాల ప్రిన్సిపాల్ మాధవ్ ముందస్తు పర్మిషన్ లేకుండా లీవ్‌లో ఉన్నట్టు గుర్తించి, వెంటనే సదరు ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేసినట్టు ఆమె తెలిపారు. అనధికారికంగా లీవ్‌లో వెళ్లడం క్షమించరాని నేరమని, ఇలా ఎవరు చేసినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అస్వస్థతకు గురైన 12 మంది పిల్లలు 10వ తరగతి చదువుతున్నారని, వారు ఇంటి నుంచి తెచ్చుకున్న పచ్చడిని కిచిడీలో కలుపుకుని తినడంతో ఇబ్బంది వచ్చిందని చెప్పారు. పిల్లలు తిన్న ఆహారంతోపాటు ఆ పచ్చడి శాంపిల్స్‌ను టెస్టులకు పంపినట్టు వెల్లడించారు. గిరిజన గురుకుల ఆశ్రమ పాఠశాలల్లో పని చేసే ఉపాధ్యాయులు, వార్డెన్‌లు ఎవరికి వారు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుండటంతోనే విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. విద్యార్థినులు అస్వస్థతకు గురైన పాఠశాల ప్రిన్సిపాల్ లీవ్‌లో ఉన్నారన్న విషయం ఉన్నతాధికారులకు తెలియకపోవడం ఏమిటని విద్యార్థి సంఘాల నేతలు ప్రశ్నిస్తున్నారు. ఇది పర్యవేక్షణలోపమేనని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. విధి నిర్వహణలో బాధ్యతారహితంగా వ్యవహించిన ప్రిన్సిపాల్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి గిరిజన ఆశ్రమ పాఠశాలలో విష ఆహారం తిన్న విద్యార్థుల అస్వస్థత ఘటన మరచిపోక ముందే, మంచిర్యాల ఘటన జరగడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

సీఎం సమాధానం చెప్పాలి

రాష్ట్రంలోని గురుకుల, ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల ఫుడ్ పాయిజన్ కేసులు రోజు రోజుకు పెరుగుతున్నాయి. అధికారుల నిర్లక్ష్యంతోనే ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. మెస్‌చార్జీలు పెంచి, నాణ్యమైన భోజనం పెడుతున్నాక కూడా విద్యార్థులు ఎందుకు దవాఖానల పాలవుతున్నారో ముఖ్యమంత్రి సమాధానం చెప్పాలి. ప్రభుత్వ హాస్టళ్లలో ఉండే విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించే దిశగా ఆలోచన చేయాలి.

- చెన్నూర్ సమ్మయ్య, మంచిర్యాల జిల్లా ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు

గురుకులాల నిర్వీర్యానికి కాంగ్రెస్ కుట్ర

- తొలి కోడింగ్ అకాడమీ ఏర్పాటు ఘనత బీఆర్ఎస్ పార్టీదే
- దానిని మూసివేసే దురాలోచనలో కాంగ్రెస్ ప్రభుత్వం
- బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్



మొయినాబాద్ మండలం పెద్దమంగళారం గ్రామంలో కోడింగ్ అకాడమీ విద్యార్థులతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ రాష్ట్ర నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

మొయినాబాద్, నవంబర్ 6: తెలంగాణలో గురుకుల విద్యావ్యవస్థను నిర్వీర్యం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు చేస్తున్నదని బీఆర్ఎస్ రాష్ట్ర నేత డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. దేశంలోనే తెలంగాణలో గురుకుల తొలి కోడింగ్ అకాడమీని ఏర్పాటు చేసిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని గుర్తుచేశారు. బుధవారం రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండల పరిధి పెద్ద మంగళారంలోని ఆజాద్ ఇంజినీరింగ్ కళాశాల భవనంలో తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యా సంస్థల ఆధ్వర్యంలో కొనసాగుతున్న గురుకుల కోడింగ్ పాఠశాలను బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కొంపల్లి అనంతరెడ్డితో కలిసి సందర్శించారు. కోడింగ్ పాఠశాలలో ఉన్న సమస్యలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. రెండు నెలల నుంచి బోధించడానికి ఉపాధ్యాయులు లేరని, 10వ తరగతి విద్యార్థులు ఇక్కడి నుంచి వెళ్లిపోయారని, 5వ తరగతిలో ప్రవేశాలు తీసుకోకుండా నిలిపివేశారని విద్యార్థులు వివరించారు. గతంలో కోడింగ్ ఎడ్యుకేషన్ అందించిన ఉపాధ్యాయులే తిరిగి తమకు కావాలని కోరారు. ఈ ఏడాది బూట్లు కూడా ఇవ్వలేదని, కొన్ని సందర్భాల్లో టిఫిన్ కూడా 10 గంటలకు పెడుతున్నారని విద్యార్థులు ఆవేదన వ్యక్తంచేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన ల్యాప్‌టాప్‌లు తప్ప కొత్త ప్రభుత్వం ఇవ్వలేదని తెలిపారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. కోడింగ్ పాఠశాలలో సమస్యలను తెలుసుకుని రావాలని కేసీఆర్ ఆదేశించడంతో ఇక్కడికి వచ్చినట్టు తెలిపారు. దేశంలోనే తొలి వెల్ఫేర్ కోడింగ్ అకాడమీని గత ప్రభుత్వం ఏర్పాటు చేసిందని, మారుమూల ప్రాంతాల విద్యార్థులకు ప్రవేశ పరీక్ష నిర్వహించి ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి కోడింగ్ అకాడమీలో సీట్లు ఇచ్చిందని చెప్పారు. కోడింగ్ అకాడమీతో పాటు మ్యూజిక్ స్కూల్స్, స్పోర్ట్స్ అకాడమీ, లా కళాశాల, పీజీ కోర్సులను కేసీఆర్ నాయకత్వంలో ఏర్పాటు చేసినట్టు గుర్తుచేశారు. ఈ కోడింగ్ అకాడమీని మూసివేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తున్నదని, నాలుగు నెలల నుంచి ఉపాధ్యాయులు లేకపోవడమే అందుకు బలం చేకూరుస్తున్నదని విపరించారు. గురుకుల విద్యా సంస్థ కార్యదర్శి సీఎం రేవంత్‌రెడ్డికి కోడింగ్ అకాడమీ గురించి తప్పుడు సమాచారం ఇస్తున్నారని ఆరోపించారు. కోడింగ్ అకాడమీ మూతపడే అంశాన్ని బీఆర్ఎస్ లేవనెత్తగా.. కోడింగ్ అకాడమీలో 218 మంది ఉంటే.. 540 మంది ఉన్నారని అధికారులు తప్పుడు లెక్కలు చెప్పున్నారని విమర్శించారు. కోడింగ్ అకాడమీలో విద్యార్థులకు కొత్త ల్యాప్‌టాప్‌లు, కనీసం బూట్లు కూడా ఇవ్వలేదని మండిపడ్డారు. గత ప్రభుత్వం ఏమీ ఇవ్వలేదని ఆరోపణలు చేసే కంటే.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చేసిందో చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులను ఏనాడైనా డిప్యూటీ సీఎం, మంత్రులు సందర్శించారా? అని ప్రశ్నించారు. సాంఘిక సంక్షేమ శాఖ రేవంత్‌రెడ్డి వద్దనే ఉందని, అయినా ఆ శాఖను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. గత ప్రభుత్వంలో అవకతవకలు జరిగాయన్న ప్పుడు.. సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని సవాల్ విసిరారు. విద్యార్థులు అధైర్యపడకుండా చదువుకోవాలని ప్రవీణ్‌కుమార్ సూచించారు. ఆయన వెంట బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు అవినాశ్‌రెడ్డి, బీఆర్ఎస్ చేవెళ్ల నియోజకవర్గ సీనియర్ నాయకులు దేశమోళ్ల ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

గురుకుల విద్యార్థులంటే

పట్టింపులేదా?

- ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే మంచిర్యాలలో ఫుడ్ పాయిజన్
- హరీశ్‌రావు ఆగ్రహం

హైదరాబాద్, నవంబర్ 6 (నమస్తే తెలంగాణ): గురుకుల పాఠశాలల్లో వరుస ఫుడ్ పాయిజన్ ఘటనలు చోటు చేసుకోవడంపై మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. వాంకిడి ఆశ్రమ పాఠశాలలో కలుషిత ఆహారం తిని 60 మంది విద్యార్థులు దవాఖాన పాలైన ఘటన మరువకముందే, బుధవారం మంచిర్యాల గిరిజన ఆశ్రమ పాఠశాలలో 12 మంది విద్యార్థులు అస్వస్థతకు గురవ్వడంపై ఆవేదన వ్యక్తంచేశారు. పదేపదే ఇలాంటి ఘటనలు జరుగుతున్నా ప్రభుత్వం మొద్దునిద్ర వీడకపోవడం శోచనీయమని ఎక్స్ వేదికగా విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గురుకులాల్లో అసలేం జరుగుతున్నది? విద్యార్థుల ప్రాణాలంటే ప్రభుత్వానికి పట్టింపు లేదా? పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందించడం కూడా సర్కారుకు చేతకాదా? అని మండిపడ్డారు. చదువుకొనడానికి పాఠశాలలకు వెళ్తే ప్రాణాలు కోల్పోయే దౌర్భాగ్య పరిస్థితి రావడం అత్యంత హేయమని పేర్కొన్నారు. సాకులు చెప్తూ తప్పించుకోవడం సర్కార్‌కు అలవాటైపోయిందని దుయ్యబట్టారు. విద్యార్థుల ప్రాణాలు, తల్లిదండ్రుల ఆవేదనను గమనంలోకి తీసుకొని సత్వర చర్యలు చేపట్టాలని సూచించారు. ఇలాంటివి పునరావృతం కాకుండా ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

'గురుకులం' ఇంటిబాట!

- ఫుడ్‌పాయిజన్‌తో ఇండ్లకు విద్యార్థులు
- 590 మంది విద్యార్థులు ఉండే వాంకిడి ఆశ్రమ పాఠశాలలో మిగిలింది 110 మందే
- ప్రశ్నార్థకంగా పర్యవేక్షణ

కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి ఆశ్రమ పాఠశాల

కుమ్రం భీం ఆసిఫాబాద్ (నమస్తే తెలంగాణ)/ వాంకిడి, నవంబర్ 6: గిరిజన విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించే ఐటీడీఏ ఆశ్రమ పాఠశాల అడుపు తప్పుతున్నది. పర్యవేక్షణ ప్రశ్నార్థకంగా మారడంతో ఆశ్రమాల్లో విద్యార్థులకు అందుతున్న ఆహారం, చదువులతోపాటు వారి సంక్షేమంపై నీలినీడలు అలుముకుంటున్నాయి. కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండల కేంద్రంలోని బాలికల ఆశ్రమ పాఠశాలలో 3 రోజుల వ్యవధిలో 76 మంది విద్యార్థినులు ఫుడ్‌పాయిజన్‌కు గురయ్యారు. మొదట 32 మంది అస్వస్థతకు గురైనప్పుడే అధికారులు సరిగా స్పందించి ఉంటే, మరో 44 మంది ఫుడ్‌పాయిజన్‌తో దవాఖాన పాలయ్యేవారు కాదు. 590 మంది ఉండే ఈ ఆశ్రమ పాఠశాలలో ఇప్పుడు 110 మంది మాత్రమే ఉన్నారు. ఫుడ్ పాయిజన్ ఘటనతో విద్యార్థులు భయభ్రాంతులకు గురవుతుండటంతో తల్లిదండ్రులు కూడా వారి పిల్లలను ఇండ్లకు తీసుకెళ్తున్నారు. పాఠశాల యాజమాన్యం వారి నుంచి లెటర్లు తీసుకుంటూ పంపించడం గమనార్హం.

కారణాలపై ఇంకా రాని క్లారిటీ

వాంకిడి ఆశ్రమ పాఠశాలలో ఫుడ్‌పాయిజన్‌కు గల కారణాలపై ఇప్పటివరకు స్పష్టత లేదు. మొదట కలుషిత నీరు కారణమని భావించి నీటి పరీక్ష చేయించారు. నీరు కలుషితం కాలేదని రిపోర్టులు వచ్చాయి. సాయంత్రం విద్యార్థుల కోసం వండిన భోజనాన్ని పరీక్షలకు పంపించారు. దాని రిపోర్టులు ఇంకా రాలేదు. ఫుడ్‌పాయిజన్ జరిగిన రోజు మధ్యాహ్నం సొరకాయ సాంబారు అన్నం, సాయంత్రం టమాట చారుతో భోజనాలు వడ్డించారు. భోజనాలు చేసిన కొద్దిసేపటికే 32 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. మరో రెండు రోజుల్లో 44 మంది విద్యార్థులు అనారోగ్యానికి గురయ్యారు. మొత్తం 76 మంది విద్యార్థులు ఫుడ్‌పాయిజన్‌కు గురయ్యారు. వీరిలో 46 మంది కోలుకోగా ఇంకా 20 మంది దవాఖానలో చికిత్స పొందుతున్నారు. ఆసిఫాబాద్‌లోని ఒక ప్రైవేట్ దవాఖానలో ఆరుగురు, మంచిర్యాలలో ముగ్గురు, హైదరాబాద్‌లో ముగ్గురు, మిగతావారు వాంకిడి పీహెచ్‌సీలో చికిత్స తీసుకుంటున్నారు. హైదరాబాద్‌లో ఒక విద్యార్థినికి వెంటిలేషన్‌పై చికిత్స అందిస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లేక ఐటీడీఏ ఆశ్రమ పాఠశాలలు అడుపు తప్పుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లాలో ఉన్న 46 ఆశ్రమ పాఠశాలల్లో దాదాపు 12 వేల మంది గిరిజన విద్యార్థులు చదువుకొంటున్నారు.

భోజనం చేసిన కొద్దిసేపటికే పడిపోయాను

ఫుడ్‌పాయిజన్ అయినరోజు సాయంత్రం మా హాస్టల్‌లో వండిన టమాట కూరతో పెట్టిన అన్నం తిన్నాను. భోజనం చేసిన కొద్దిసేపటికే పడిపోయాను. నాలాగే చాలామంది అనారోగ్యానికి గురయ్యారు. అందరినీ దవాఖానకు తీసుకొచ్చారు. ఇప్పుడు బాగున్నాను. మా హాస్టళ్లో ప్రతి రోజులాగే ఆరోజు కూడా భోజనాలు పెట్టారు. మాకు ఎందుకు ఇలా అయ్యిందో తెలియదు.

- వైష్ణవి, 9వ తరగతి, వాంకిడి ఆశ్రమ పాఠశాల (వాంకిడీ పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న బాలిక)

ఇంటి నుంచి తెచ్చుకోలేదు

మేము ఇంటి నుంచి ఏమీ తెచ్చుకొని తినలేదు. రోజూ హాస్టల్‌లో పెట్టే భోజనం మాత్రమే తిన్నాను. అన్నం తిన్న కొద్దిసేపటికే పడిపోయాను. వాంతులు కూడా అయ్యాయి. తర్వాత మమ్మల్ని దవాఖానకు తీసుకొచ్చారు. మా హాస్టల్లో చాలామందికి ఇలాగే జరిగింది. ఇప్పుడు ఆరోగ్యం బాగానే ఉన్నది. హాస్టల్‌లో తాగేనీళ్లు సరిగా లేకపోవడంతోనే మాకు వాంతులు, విరేచనాలు అయ్యాయని అనుకుంటున్నారు.

- కాత్లె వేదిక 9వ తరగతి, వాంకిడి ఆశ్రమ పాఠశాల (వాంకిడీ పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న బాలిక)

కారణాలు తెలుసుకుంటున్నాం

ఆశ్రమ పాఠశాలలో ఫుడ్‌పాయిజన్‌కు గల కారణాలు తెలుసుకుంటున్నాం. విద్యార్థులు తాగేనీళ్లలో ఎలాంటి కలుషితాలు లేవని నీటిని పరీక్షించిన అధికారులు రిపోర్టు ఇచ్చారు. ఆ రోజు విద్యార్థుల కోసం వండిన అన్నాన్ని పరీక్షల కోసం పంపించాం. ఆ రిపోర్టు వస్తే కారణాలు తెలుస్తాయని భావిస్తున్నాం. ఆశ్రమంలో రెగ్యులర్‌గా మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నాం. **- శ్రీనివాస్, ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం**

సీఎం యాత్రను అడ్డుకుంటం

- అంబుజా పరిశ్రమను రద్దు చేయకపోతే రైతులు, వృత్తిదారులతో వెళ్లి నిలదీస్తాం
- మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య హెచ్చరిక

రామన్నపేట, నవంబర్ 6 : రామన్నపేట మండల కేంద్రంలో అదానీ గ్రూప్ నిర్మించాలని చూస్తున్న అంబుజా సిమెంట్ పరిశ్రమ అనుమతులను సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే రద్దు చేయాలని, లేనిపక్షంలో జిల్లాలో ఆయన చేపట్టనున్న యాత్రను అడ్డుకుంటామని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య హెచ్చరించారు. పరిశ్రమను రద్దు చేసి మండల ప్రజలకు ముఖ్యమంత్రి తన పుట్టినరోజు కానుకను అందించాలని కోరారు. బుధవారం ఆయన రామన్నపేటలో మీడియాతో మాట్లాడారు. శుక్రవారం రేవంత్‌రెడ్డి వలిగొండ మండలం సంగెం వరకు చేపట్టే పాదయాత్ర రామన్నపేట వరకు పొడిగించి ఇక్కడి ప్రజల ఆవేదనను అర్థం చేసుకుని సానుకూల ప్రకటన చేయాలని సూచించారు. లేనిపక్షంలో పార్టీలకతీతంగా చిట్యాల, రామన్నపేట మండలాల ప్రజలు, రైతు లు, వృత్తిదారులతో పాదయాత్రగా వెళ్లి ముఖ్యమంత్రిని నిలదీస్తామని హెచ్చరించారు. మూసీ ప్రక్షాళనకు బీఆర్ఎస్ పార్టీ వ్యతిరేకం కాదని, ప్రక్షాళన పేరుతో ప్రజాధనాన్ని దోపిడీ చేసే కుట్రను మాత్రమే వ్యతిరేకిస్తున్నామని పేర్కొన్నారు. కాలుష్యకారక సిమెంట్ పరిశ్రమ ఏర్పాటుపై జిల్లా మంత్రులు, కాంగ్రెస్ నాయకులు నోరుమెదపకపోవడం దారుణమని అన్నారు. అధికార పార్టీ నాయకులు ఉద్యమాలు చేయనవసరం లేదని ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తే సరిపోతుందని హితవు పలికారు. పరిశ్రమ ఏర్పాటును ఆపేందుకు చొరవ తీసుకునే కాంగ్రెస్ ప్రజాప్రతినిధులను సన్మానిస్తామని తెలిపారు. సిమెంట్ పరిశ్రమ ఏర్పాటుకు ప్రభుత్వం అంగీకరిస్తే ప్రజలు పారలు, గడ్డపారలతో కదిలివస్తారని.. ఆపై జరిగే పరిణామాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

మక్తల్‌లో ఒకరికి స్వైన్‌ఫ్లూ

మక్తల్, నవంబర్ 6 : నారాయణపేట జిల్లా మక్తల్‌లో స్వైన్‌ఫ్లూ కలకలం రేపుతున్నది. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ప్రోగ్రాం అధికారి రాఘవేంద్రరెడ్డి తెలిపిన వివరాలు.. మక్తల్‌కు చెందిన విశ్రాంత ఉద్యోగి నాగప్ప అనారోగ్యంతో బాధపడుతుండగా వారం క్రితం కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. రక్తనమూనాలు పరీక్షించగా స్వైన్‌ఫ్లూ సోకినట్టు వైద్యులు నిర్ధారించారు. రాష్ట్ర వైద్యారోగ్య కార్యాలయ అధికారులు బుధవారం డీఎంహెచ్‌వో కార్యాలయానికి సమాచారం అందించారు. దీంతో మక్తల్‌లో స్వైన్‌ఫ్లూ సోకిన వ్యక్తి ఇంటి పరిసరాల్లోని 60 కుటుంబాలకు పరీక్షించగా.. ఏ ఒక్కరికీ వ్యాధి లక్షణాలు కనిపించలేదు. నాగప్ప వద్ద ఉంటున్న ముగ్గురిని పరీక్షించగా.. జ్వరం, దగ్గు, జలుబుతో బాధపడుతున్నట్టు గుర్తించారు. స్వైన్‌ఫ్లూకు మందులున్నాయని, ప్రజలు అధైర్యపడొద్దని డీఎంహెచ్‌ఓ రాఘవేంద్రరెడ్డి తెలిపారు.

మూసీ కాదు.. పాపాలను ప్రక్షాళన చేసుకో

- 1200 ఎకరాల భూములపై రేవంత్ కన్ను
- కేసీఆర్ ఆనవాళ్లను చెరిపేసే దమ్ముందా?
- బంగారు తాపడం వివరాలపై స్పష్టతనివ్వాలి
- రేవంత్‌కు గొంగిడి సునీతా మహేందర్‌రెడ్డి డిమాండ్

యాదగిరిగుట్ట, నవంబర్ 6 : మూసీ ప్రక్షాళన కాదు.. యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామివారిని వేడుకుని చేసిన పాపాలకు ప్రక్షాళన చేసుకో అని సీఎం రేవంత్‌రెడ్డికి మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి హితవు పలికారు. రాష్ట్రంలో కేసీఆర్ ఆనవాళ్లులేకుండా చేస్తానని చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, అదే కేసీఆర్ మహాద్భుతంగా పునర్నిర్మించిన యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకునేందుకు వస్తున్నాడని అన్నారు. స్వామివారిని పుణ్యాత్ములు, పాపాత్ములు దర్శించుకుంటారని, సీఎం రేవంత్‌రెడ్డి సైతం తాను చేసిన పాపాలను ప్రక్షాళన చేసుకునేందుకు స్వామివారిని దర్శించుకునేందుకు రావాలని కోరారు. వంద మంది ముఖ్యమంత్రులొచ్చినా తెలంగాణలో కేసీఆర్ ఆనవాళ్లు చెరిపివేయలేరని అన్నారు. బుధవారం ఆమె యాదగిరిగుట్టలో మీడియాతో మాట్లాడారు. సీఎం రేవంత్ టెంపుల్ సిటీ 1200 ఎకరాల భూములను కబ్జా చేస్తారేమోనన్న భయం కలుగుతుందని అన్నారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా మాజీ సీఎం కేసీఆర్ రూ.1,300 కోట్లతో ఎంతో గొప్పగా యాదగిరిగుట్టను నిలిపారని, భక్తులకు సౌకర్యవంతమైన రహదారులను నిర్మించారని తెలిపారు. యాదగిరిగుట్ట విమానగోపురం స్వర్ణతాపడానికి వచ్చిన బంగారంపై స్పష్టతనివ్వాలని సునీత డిమాండ్ చేశారు. గతంలో 125 కిలోల బంగారం అవసరమని గత స్థపతులు, ఆర్ట్ డైరెక్టర్ నిశ్చయించారని, గతంలో ఎంతమంది భక్తులు విరాళంగా ఇచ్చారని, ఇప్పటివరకు ఎంత బంగారం, నగదు సమకూరిందో స్పష్టత నివ్వాలని కోరారు.

రామగుండంలో కూల్చివేతలు ఆపండి

- చిరువ్యాపారులతో కలిసి బీఆర్ఎస్ శ్రేణుల ఆందోళన
- మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌తో కలిసిబల్దియా కార్యాలయం ముట్టడి

రామగుండం బల్దియా ఆఫీస్ వద్ద ధర్నా చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కోరుకంటి, బీఆర్ఎస్ శ్రేణులు

కోల్‌సిటీ, నవంబర్ 6: అభివృద్ధి పేరిట రామగుండం నగరపాలక సంస్థ పరిధిలో జరుగుతున్న కూల్చివేతలను ఇప్పటికైనా ఆపాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. కూల్చివేతలను నిరసిస్తూ రామగుండం మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పెద్దపల్